క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు


ప్రిన్సిపాల్ కె.పాపయ్య

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం గ్రామశివార్లోనున్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో 2023– 24 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ నెల 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. గురువారం ఆయన మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని, ఇంగ్లిష్‌లో బోధన ఉంటుందని, ఎటువంటి ఫీజులు ఉండవన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించి ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 9182958496 నంబరులో సంప్రదించాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కాసు పరామర్శ

గురజాల: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు దిగుడుబావిలో జారిపడి మృతిచెందిన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యశాలలో మృతదేహాలను సందర్శించిన ఎమ్మెల్యే కాసు మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంటనే వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యనుమల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణ బుజ్జి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, కౌన్సిలర్ కె.అనిల్, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, పి.హనిమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న మరో లారీ

గురజాల: ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో దాన్ని వెనుకనుంచి వచ్చిన మరో లారీ ఢీకొన్న ఘటన గురువారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం తంగెడ రోడ్డులో ముందుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా నిలుపుదల చేయడంతో వెనుక నుంచి సర్వేబాదులతో వస్తున్న లారీ ఢీకొంది. లారీలో ఉన్న సర్వే బాదులు కిందపడ్డాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. సుమారు అర్ధగంటకు పైగా రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

పేకాట రాయుళ్లు అరెస్టు

దుర్గి: మండల పరిధిలోని కాకిరాల గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ కె.సతీష్ తెలిపారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 8250 నగదును స్వాధీనపరుచుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. పేకాట, కోడిపందేలు, నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కౌలు వేలం వాయిదా

క్రోసూరు: సత్తెనపల్లి మండలంలోని బృగుబండ గ్రామంలో గల జగన్నాథస్వామి దేవస్థానం భూముల కౌలు వేలం వాయిదా పడినట్లు ఈఓ రంగిసెట్టి సూరినారాయణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2 వ తేదీ, శుక్రవారం మండలంలోని గుడిపాడు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించాల్సిన జగన్నాథస్వామి దేవాలయం భూముల (29.18 ఎకరాల) కౌలు వేలం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియపరచనున్నట్లు ఈఓ వివరించారు.

ఆరంభమైన ప్రతిష్టా కార్యక్రమాలు

వినుకొండ టౌన్: పట్టణంలోని మార్కాపురం రోడ్డు నందుగల రావి చెట్టు రంగా బొమ్మ సెంటర్‌లో శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలియచేశారు.
శనివారం గణపతి పూజ, ఘర్తాన్యాసము, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

కౌలు రైతు అర్హత కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: అర్హులైన కౌలు రైతులు రుణ అర్హత కార్డులను పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారుల వద్ద దరకాస్తు ఫారాన్ని తీసుకుని సాగు రైతుల నుంచి పాస్‌బుక్ జిరాక్స్‌తో పాటు వారి ఆధార్ కార్డు, ఆమోద పత్రం తీసుకుని కౌలు రైతు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్‌తో సహా గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. పరిశీలించిన వీఆర్వోలు రుణ అర్హత కార్డులను మంజూరు చేస్తారని, గ్రామ సభల ద్వారా వాటిని కౌలు రైతులకు అందిస్తామన్నారు.

రీసర్వే బృందాలకు సహకరించండి

గురజాల ఆర్డీఓ అద్దయ్య


రైతులతో మాట్లాడుతున్న గురజాల ఆర్డీఓ కె.అద్దయ్య, తహసీల్దార్ కె.పుల్లారావు

రెంటచింతల: భూ సమగ్ర సర్వేలో భాగంగా గ్రామాలలో పర్యటించే భూ రీసర్వే బృందాలకు రైతులు సహకరించాలని గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య కోరారు. గురువారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో ఆయన తహసీల్దార్ కట్టే కోట పుల్లారావుతో కలిసి క్షేత్రస్థాయిలో భూ రీస్వే చేపట్టిన భూములను పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే భూ రీసర్వే చేసే బృందాలలోని సభ్యులైన గ్రామ వీఆర్వోలకు, సచివాలయ సిబ్బందికి, సర్వేయర్లుకు శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామాలలో నెలకొన్న భూ వివాదాలను పరిష్కారం చేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా రాష్ట్ర ప్రభుత్వం 100 సంవత్సరాల అనంతరం ప్రతిష్టాత్మకంగా ఈ సమగ్ర భూ రీసర్వే చేపట్టడం జరిగిందని వివరించారు. ఓఆర్‌ఐ మ్యాప్ ఆధారంగా చేపట్టిన ఈ భూ రీసర్వేను సకాలంలో పూర్తి చేయడానికి గ్రామానికి ఒక వీఆర్వో, గ్రామ సర్వేయర్, సచివాలయ సిబ్బందితో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను మూడు దశలలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సర్వే ప్రక్రియలో ముందుగా డ్రోన్స్, ఓఆర్‌ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్ల సమకూర్చుకుని నాలుగు కీలక పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రైతులు వారివారి భూముల వద్దకు వెళ్లి రీ సర్వే బృందాలకు వారి భూముల సరిహద్దు రాళ్లను చూపించి సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రెట్టడి శ్రీనివాసరావు అనే రైతు తనపాలం అడంగల్‌లో 5 సెంట్ల భూమి అదనంగా కనిపిస్తుందని కానీ భూమి మాత్రం ఖచ్చితంగానే ఉందని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చాడు. ఇటువంటి పొరపాట్లను సరిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జయరాజు, మండల సర్వేయర్ తోట సుధాకర్, గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వాలీబాల్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్స్‌ను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. పట్టణంలోని ఎస్సీ యూత్ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన లారీ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం...

నూతన లారీ అసోసియేషన్ కార్యాలయం గురువారం స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పట్టణంలోని కొండమోడు రోడ్డులోని మన్నెం అప్పిరెడ్డి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నూతన లారీ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటుతో లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించుకోవచ్చని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, నాయకులు, సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు భవితకు అవరోధాలు'

సీడీపీఓ జి.లీలావతి

రెంటచింతల: బాల్య వివాహాలు ఆడపిల్లల భవితకు అవరోధాలుగా మారుతున్నాయని మాచర్ల ప్రాజెక్టు సీడీపీఓ జి.లీలావతి అన్నారు. గురువారం రెంటచింతలలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొంతమంది తల్లిదండ్రులు బాలికలకు చదువుకునే వయస్సులోనే వివాహ బంధం పేరుతో బంధనం వేస్తున్నారన్నారు. దీని వలన ఆ బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. బాల్య వివాహాలతో చిన్నారుల జీవితాలతో ఆడుకుంటున్నారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ఐసీడీఎస్, ఐసీపీఎస్ శాఖల ద్వారా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామస్థాయిలో ఎక్కడైనా బాల్యవివాహాల వివరాలు పక్కాగా తెలియగానే వెంటనే స్పందించి ముందుగానే బాల్యవివాహాలను అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ ఎం.జ్యోతి, వి.దుర్గా, ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం...

కారంపూడి: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేర మని తహశీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, వీఆర్వోలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీలు, మహిళా పోలీసులు సమన్వయంతో పని చేసి బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే ఆగ్రామానికి చెందిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలా గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే వాటి వలన కలుగు అనర్థాలు, నష్టాలు గురించి క్షుణ్ణంగా తెలియ చేయాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ, ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు తదితరులున్నారు.

శభాష్ వలంటీర్!

- మూడు అవార్డులు అందుకున్న వలంటీర్ రంజిత్ కుమార్
- సన్మానించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


వలంటీర్ రంజిత్ కుమార్‌ను సన్మానించి, అభినందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వలంటీర్ రంజిత్ కుమార్ సేవలకుగానూ మూడు అవార్డులు అందుకున్నాడు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వలంటీర్ వై.రంజిత్ కుమార్‌ను సన్మానించి అభినందించారు. ఇటువంటి సేవలు మరింతగా అందించి ప్రతిభను చాటుకోవాలని సూచించారు. రంజిత్‌కుమార్ 2019 నుంచి పట్టణంలోని 15 వార్డులోని 9వ నంబరు సచివాలంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో 2021లో సేవా వజ్ర అవార్డు అందుకున్నారు. అలాగే 2022లో సేవా మిత్ర అవార్డు అందుకోని, ఉత్తమ వలంటీర్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సన్మాన కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఇప్పుడు 2023లో సేవా రత్న అవార్డును సైతం అందుకున్నారు. రంజిత్‌కుమార్ ప్రతి సంవత్సరం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పట్టణ ప్రజలతోపాటు, అధికారులతో సైతం శభాష్ అనిపించుకుంటున్నారు. వలంటీర్ రంజిత్‌కుమార్ అభినందన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దీన్, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ ఎండీ రఫీద్, గొట్టిముక్కల పవన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మార్కెట్ యార్డు సభ్యులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దుర్గి మండలం మంగాపురం తండాలో వృద్ధురాలు కప్పిర మంగమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ఎం.హరిలాల్ నాయక్ – దుర్గి

గోదాముకు భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం సొసైటీ పరిధిలో గుంటుపాలెం గ్రామంలో రైతుభరోసా గోదాం నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కారుమంచి సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు ప్రభుత్వ స్థలం 33 సెంట్లు వ్యవధిలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నులు గోదాం పనులకు భూమి పూజ చేపట్టగా నాలుగు నెలల వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల కోలాహలం


అమ్మవారిని దర్శించుకున్న మాచర్ల మున్సిపల్ కమిషనర్ రమణబాబు

దుర్గి: ఉదయ తెలుగురాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దర్శనానికి గురువారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. వేసవి సెలవులు దృష్ట్యా పలువురు భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని బంధుమిత్రులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ఉదయం బిందుతీర్థంతో ప్రారంభమైన కార్యక్రమాలు తదనంతరం నైవేద్యం, ఆరాధనలతో కొనసాగాయి. మాచర్ల మున్సిపల్ కమిషనర్ రమణబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా కమిషనర్‌ను శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంతంలో కొనసాగిన వివిధ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ పలువురు హాజరయ్యారు. మహిళలు భారీగా హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది వేసవి దృష్ట్యా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ పరిసర ప్రాంతంలో షామియాలను ఏర్పాటు చేసి మంచి నీటి సౌకర్యాన్ని కల్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం


విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో కళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టామహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణలు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా దేవాలయ వేదపండితులు రాష్ట్ర మంత్రి అంబటిని, యర్రం వెంకటేశ్వరరెడ్డి, రాజనారాయణలను మేళ తాళాలతో దేవాలయంలోకి ఆహ్వానం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నూతనంగా ప్రతిష్టించిన అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీమడేల్ పరమేశ్వరస్వామికి నూతనంగా నిర్మించిన దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీటీసీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి: సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జరిగితేనే 100 శాతం అక్షరాస్యత సాధ్యం అవుతుందని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు సత్తెనపల్లి పట్టణంలోని బెడ బుడిగ జంగాల కాలనీలో గురువారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన పై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారిని పనులకు పంపించకూడదన్నారు. పనుల్లో చేర్చుకొన్న ఆ సంస్థ యజమానులపై కానీ, సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోని కేసులు నమోదు చేయవచ్చునన్నారు. ముందుగా అక్కడకు వెళ్లిన టీం అక్కడ ఉన్న ప్రతి చిన్న పిల్లవాడిని పలకరించి వారు ఎక్కడ చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. మరో న్యాయవాది లక్ష్మణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను 14 సంవత్సరాలు వచ్చే వరకు ఖచ్చితంగా పాఠశాలలకు పంపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో దుకాణాల్లో కానీ పరిశ్రమల్లో కానీ, వ్యవసాయ పనులకు పంపకూడదన్నారు. అలా చేస్తే చట్టపరంగా కార్మిక శాఖ వారు చర్యలు తీసుకోని కేసులు నమోదు చేస్తారన్నారు. కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజాలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగుడికి రూ.2.5 లక్షల చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్


కలెక్టరేట్‌లో దివ్యాంగుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని ఏనుగుపాలెంకు చెందిన దివ్యాంగుడు గుడిపూడి అంకారావుకు (పి.ఎం.ఈ.జి.పి) ప్రధానమంత్రి గ్రామీణ ఇన్ కంజనరేషన్ పథకం ద్వారా గ్రామంలో చిన్న తరహా పరిశ్రమ బంగాళదుంప చిప్స్ తయారీ (పొటాటో చిప్స్ ఇండస్ట్రీ) ఏర్పాటుకు కలెక్టర్ తోడ్పాటు అందించారు. గతంలో అంకారావు ఈ పథకం ద్వారా ఉపాధి పొందేందుకు కలెక్టర్ ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుడు చెల్లించాల్సిన మార్జిన్‌మనీ సరిపడినంత లేకపోవడంతో, కలెక్టర్ స్పందించి తగినంత ఆర్థిక సహకారం అందించారు. దీంతో ఏనుగుపాలెం కెనరాబ్యాంక్ అధికారులు లబ్ధిదారుడు అంకారావు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన యంత్రసామాగ్రి కొనుగోలుకు రూ.2.50 లక్షల చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారుడు అందుకున్నారు. ప్రభుత్వం అందించిన సహకారాన్ని వినియోగించుకొని పరిశ్రమలు స్థాపించి, బ్యాంకు రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ, జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని లబ్ధిదారునికి సూచించారు. సకాలంలో తీసుకున్న రుణాలను బ్యాంకులకు చెల్లించడం ద్వారా అర్హత కలిగిన ఇతర పేదలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీలలితా పరమేశ్వరి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నియంత్రణ చర్యలతో వ్యాధులు దూరం


వెంగళరెడ్డి నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: కీటక జనిత వ్యాధుల నియంత్రణలో ప్రజాభాగస్వామ్యం తప్పనిసరి అని వెంగళరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ షేక్ సిరాజున్నిసా అన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం జూన్ 2023 మాసాన్ని మలేరియా వ్యతిరేక మాసంగా ప్రకటించడంతో గురువారం ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరాజున్నిసా మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు మొదలైన వ్యాధుల గురించి వివరించి, రాకుండా చేపట్టవలసిన చర్యలు గురించి తెలిపారు. ప్రజలందరూ నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్ ఎంపీ కిరణ్ బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, హెల్త్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధూమపానంతో ఉపిరితిత్తుల క్యాన్సర్


ఫణిదంలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: పొగతాగుటం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పి.హెచ్.సి.వైద్యాధికారి డాక్టర్ వేమవరపు ప్రదీప్ ఆధ్వర్యంలో గ్రామంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలచే పొగాకు, గుట్కా వాడకాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు నములుట, గుట్కా, పాన్ పారాగ్ వంటి ఉత్పత్తులు నములుట వలన గొంతు క్యాన్సర్, జీర్ణాశయ కాన్సర్, నోటి కాన్సర్ వంటి వ్యాధులు సోకి మరణానికి దారితీస్తాయని తెలియజేశారు. హెచ్ఈఓలు పి.వెంకటరావు, ఖదీర్, డీపీఎంఓ నాగేశ్వరరావు నాయక్, పి.హెచ్.యన్. మీనాక్షమ్మ, పంచాయతీ కార్యదర్శి వీరాంజనేయులు, చైతన్య, మహిళా పోలీస్, పి.హెచ్.సి.సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నకరికల్లు: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తే పెనాల్టీ చెల్లించాల్సిన అవసరం ఉండదని విద్యుత్ శాఖ ఏఈ రూఫస్ డానియేల్ గురువారం తెలిపారు. విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా, విద్యుత్‌శాఖ యాప్ ద్వారా కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా చెల్లించవచ్చన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడం ద్వారా బిల్లులు కూడా తక్కువగా వస్తాయన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలి

పెదకూరపాడు: మహిళలు తీసుకున్న రుణాలతో వ్యాపార అభివృద్ధి సాధించాలని గుడ్‌షెఫర్డ్ సిస్టర్ డైరెక్టర్ ఇన్నరాశి అన్నారు. అమరావతిలో గుడ్‌షెఫర్డ్ సిస్టర్ ఆధ్వర్యంలో యుఫ్రేసియా కో–ఆపరేటీవ్ సొసైటీ ఆధ్వర్యంలో అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లోని మహిళలకు వ్యాపారాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రేస్ సంస్థ డైరెక్టర్ జి.నళిని శిక్షణ ఇచ్చారు. అనంతరం సిస్టర్ ఇన్నరాశి మాట్లాడుతూ మహిళలు నూతన వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. వ్యాపారాభివృద్ధికి 30 మంది మహిళలకు రూ.5.10 లక్షలు రుణంగా ఇచ్చామన్నారు. తీసుకున్న రుణాలతో పచ్చళ్లు, కారంపొడి తయారీ, చిల్లరకొట్టు వ్యాపారం, కూరగాయల వ్యాపారం తదితర వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబాన్ని పోషించుకోవాలన్నారు. కార్యక్రమంలో కో ఆపరేటీవ్ సొసైటీ సభ్యులు లక్ష్మణ్, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.